ప్రజాశక్తి

మంగళవారం 23 డిసెంబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

సైబర్ మోసాల నుండి రక్షణ అవసరం

డిజిటల్ ఫోరెన్సిక్ ప్రయోగశాల ప్రారంభోత్సవంలో స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి - కంకిపాడు : సైబర్ మోసాల నుండి ప్రజలను రక్షించేందుకు సైబర్ భద్రత డిజిటల్ ఫోరెన్సిక్ ప్రయోగశాల ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విద్యార్థులు బాగా శిక్షణ పొంది ఆ దిశగా ప్రజలందరికీ అవగాహన కలిగించాలని పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరులో కాకినాడ సి పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సిఎండి కెవి రావు అందించిన రూ.1.36 కోట్ల విరాళంతో కెవి రావు పేరుతో ఏర్పాటు చేసిన సైబర్ భద్రత డిజిటల్ ఫోరెన్సిక్ ప్రయోగశాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆ ప్రయోగశాల సైబర్ నేరాలను ఎలా పసిగట్టి నియంత్రిస్తుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ నేరాలు, దోపిడీలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సెల్ ఫోన్లకు నేరస్తులు సందేశాలు పంపుతుంటారని, పొరపాటున దాన్ని క్లిక్ చేస్తే మనకు తెలియకుండానే మన బ్యాంకు ఖాతాల్లో డబ్బులు మాయమైపోతున్నాయని అన్నారు. ఇటువంటి వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ మారుతున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. అయితే నేరాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందడుగు వేసి అన్ని ఉమ్మడి జిల్లాల్లోనూ సైబర్ నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా సిద్ధార్థ విద్యాసంస్థల యాజమాన్యం...దాత కె.వి.రావును, శాసనసభ సభాపతి, ఉప సభావతీలను ఘనంగా సన్మానించింది. సిద్ధార్థ విద్యాసంస్థల అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజయ్య, లక్ష్మణరావు, ఉప కులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, విసి ఏవి రత్న ప్రసాద్, పిన్నమనేని వైద్య కళాశాల డైరెక్టర్ సివి రావు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం వేడుకోలు

మీ కోసంలో వినతులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 19 నెలల్లో సామాజిక పింఛన్ల దరఖాస్తుకు అవకాశం కల్పించలేదు. దీంతో వృద్ధాప్యం, అనారోగ్యం, వైకల్యంతో బాధపడే వారికి, గీత కార్మికులకు పింఛన్లు మంజూరు కావడంలేదు. ఈనేపథ్యంలో సోమవారం మచిలీపట్నంలోని కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో పెద్దఎత్తున ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. ఎన్‌టిఆర్ గృహాలు, అన్నదాత సుఖీభవ పథకం నగదు జమ చేయాలని, తాగునీరు, భూముల సమస్యలు పరిష్కరించాలని, అక్రమ చేపల చెరువుల తవ్వకాలను ఆపాలని, కాంట్రాక్టు బిల్లులు చెల్లించాలని పలువురు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఉయ్యూరు మండలం రొయ్యూరుకు చెందిన గీత కార్మికుడు ఆర్ నాగేశ్వరరావు, మచిలీపట్నం రామానాయుడుపేటకు చెందిన వృద్ధుడు వీరత్ జయకృష్ణవర్ధన్, కోడూరు మండలం స్వతంత్రపురానికి చెందిన పక్షవాతం బాధితుడు కస్తూరి శ్రీరంజని, మచిలీపట్నం మండలం చినయాదరకు చెందిన పనిచేస్తూ గాయపడిన తాపీ కార్మికుడు అర్జా రాధాకృష్ణ, మచిలీపట్నం సుకర్లాబాద్‌కు చెందిన అబ్దుల్ ఖలీల్ తదితరులు తమకు పింఛన్లు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందించారు. అన్నదాత సుఖీభవ పథకం నగదు జమ కాలేదని తోట్లవల్లూరుకు చెందిన పెద్దబోయిన మాధవి ఫిర్యాదు చేశారు. 2017లో ఎన్‌టిఆర్ గృహ కల్ప పథకం కింద ఇల్లు నిర్మించుకున్నా ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని గూడూరు (మిగతా 2లో)

పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

'ముస్తాబు'తో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

బిసి సంక్షేమ మంత్రి సవిత

ప్రజాశక్తి - మోపిదేవి : విద్యార్థులు బాగా చదువుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర బీసీ ఈడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. కృష్ణాజిల్లా మోపిదేవిలో మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, బీసీ సంక్షేమ వసతి గృహం ముస్తాబు కార్యక్రమాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన అద్దం, దువ్వెన, చేతులు శుభ్రం చేసుకొనే వాష్ బేసిన్ మంత్రి పరిశీలించారు. తదుపరి పాఠశాల, వసతి గృహాల చుట్టూ కలియతిరిగి వంట గదులు, ఆర్వో ప్లాంట్, స్నానపు గదులు, మరుగుదొడ్లు, టీవీలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి వద్దకు వెళ్లి వారి వ్యక్తిగత శ్రద్ధ, సంక్షేమ పథకాల అమలు, సమస్యలు తదితర విషయాలపై ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని అల్పాహారం, చిక్కి రుచి చూశారు. ఈసందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో 70 లక్షల మంది విద్యార్థులకు ముస్తాబు కార్యక్రమంపై అవగాహన కలిగిస్తున్నామన్నారు. స్థానిక ఎంఎల్ఎ మండలి విజ్ఞప్తి మేరకు అదనపు తరగతి గదుల మంజూరునకు నిధులు కేటాయించాలని ఇప్పటికే ప్రతిపాదించామని చెప్పారు. త్వరలో నిధులు విడుదలవుతాయన్నారు. ఎంఎల్ఎ మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ గురుకులానికి భవనాల కొరత ఉందని, 8 గదులు అవసరం ఉందని మంత్రి దష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సంచాలకులు మల్లికార్జున, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి పి.మాధవి లత, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు, మోపిదేవి ఎంపిపి దుర్గారాణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వరరావు, బిసి కార్పొరేషన్ ఈడీ రాజేంద్రబాబు, బీసీ సంక్షేమాధికారి రమేష్, ప్రిన్సిపాల్ వీరా రవి, వార్డెన్ సురేష్, సర్పంచు మేరీ రాణి పాల్గొన్నారు.

వన్‌టౌన్ హెడ్ పోస్టాఫీసు గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నేతలు

మహాత్మునిపై విద్వేషం

● వామపక్ష నేతల ఆగ్రహం ● 'ఉపాధి' పేరు మార్పుపై నిరసన
● చంద్రబాబు, పవన్ కళ్యాణ్, జగన్ నోరు మెదపడంలేదని విమర్శ

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ మోడీ సర్కార్ నూతనంగా తీసుకువచ్చిన జి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని వామపక్ష పార్టీల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నేరెగా) స్థానంలో మోదీ సర్కార్ కొత్తగా తీసుకొచ్చిన విబి–జి రాం జి 2025 (వికసిత్ భారత్–గ్యారెంటీ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) బిల్లును వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈనేపథ్యంలో వామపక్షాల ఆధ్వర్యాన సోమవారం విజయవాడ వన్‌టౌన్‌లోని హెడ్ పోస్ట్ ఆఫీస్, గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ దేశ స్వాతంత్ర్యానికి నేతృత్వం వహించిన నేతల పేర్లను నిస్సిగ్గుగా తొలగించేందుకు వెనకాడటం లేదని మండి పడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో బిజెపి ప్రభుత్వం మహాత్మునిపై విద్వేషం వెళ్లగకుతోందన్నారు. మతోన్మాదం ప్రతిబింబించేలా కొత్త చట్టాలకు పేర్లు పెడుతోందని విమర్శించారు. ఇది లౌకిక రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమన్నారు. ఈ చర్య బిజెపి అప్రజాస్వామిక పాలనకు పరాకాష్టగా పేర్కొనవచ్చన్నారు. ఓవైపు మహాత్మా గాంధీ పేరు తొలగింపు, మరోవైపు రాష్ట్రంపై అదనపు భారం పడుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి నోరు మెదపడంలేదన్నారు. సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఓట్ల కోసం మతాల మధ్య విద్వేషం సష్టించింది చాలదన్నట్లుగా మరోసారి మతాలను ప్రతిబింబించే విధంగా చట్టాలకు పేర్లు పెడుతోందని, ప్రజల్లో మరోసారి మత వైషమ్యాలను సష్టించాలని చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడాన్ని తప్పుబట్టారు. కూటమినేతలు తమ స్వప్రయోజనాల కోసం కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ఈ ధర్నాలో ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరామ్, ఎస్‌యుసిఐ నాయకులు సుధీర్, న్యూ డెమోక్రసీ నేత రామకృష్ణ, లిబరేషన్ నాయకులు ఈశ్వర్ (మిగతా 2లో)

విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎపిఎన్‌జిజిఓ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ తదితరులు

ఉద్యోగుల సమస్యలపై వెనకడుగు వేయం

● ఎపిఎన్‌జిజిఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్
● విజయవాడ నగర కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ముందడుగులు వేస్తున్నామని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ విజయవాడ నగరశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం నగరంలోని గాంధీనగర్ ఏపీ ఎన్‌జీవో హోంలో జరిగాయి. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన ర్యాలీకి ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ర్యాలీలో విద్యాసాగర్ మాట్లాడుతూ 75 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిందన్నారు. నేడు ఉద్యోగులు పొందుతున్న ప్రతి సౌకర్యం సాధించడం వెనుక కేవలం దాని అవిరళ కృషే కారణమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఏపీ ఎన్‌జీజీవో సంఘం చేపట్టిన ప్రతి (మిగతా 2లో)

నూతన సంవత్సర సంగీత విభావరి

విజయవాడ : "నా నేస్తం" మ్యూజికల్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక గాంధీనగర్ వి.హెచ్. గ్రంథాలయంలో.. 'నూతన సంవత్సర స్వాగత సంగీత విభావరి' ఆహ్లాదకరంగా జరిగింది. సంస్థ అధ్యక్షుడు, గాయకుడు నాగ భూషణం (రైల్వే) నిర్వహణలో జరిగిన కచేరీలో సుమలత, మాధవి, రాంబాబు, సీతాదేవి, రమణ, పరమేశ్వరి, వెంకట్, శైలజ, విశ్వనాథ్, వెంకటేష్, బ్రహ్మం తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు వివిధ సినిమాల్లోని పాటలు పాడి ప్రేక్షకుల్ని ఆనందపరిచారు.

ఆకట్టుకున్న 'తద్దినక తప్పదిక..'

విజయవాడ : టిల్లు ఈవెంట్స్ ఆధ్వర్యంలో "తద్దినక.. తప్పదిక" మకుటంతో సోమవారం రాత్రి గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్ లో సినీ సంగీత విభావరి మనోరంజకంగా జరిగింది. "ఈవెంట్స్" అధినేత, గాయకుడు లక్ష్మణ్ నాయక్ నిర్వహణలో ఔత్సాహిక గాయనీ గాయకులు సుబ్రహ్మణ్యశర్మ, సీతాదేవి, కె.జీవరత్నం, పసుపులేటి శ్రీనివాస్, రత్నాకర్, వేణుగోవింద్, దయామణి, సుకన్య, మహేశ్వరి, ఉదయభాను, కష్ణకుమారి, దుర్గ, కుసుమాంజలి, రాయరాజు, (విఎంసి)శ్రీనివాస్, డా. జి.ప్రశాంతి తదితరులు పాడిన పాటలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ట్రాక్ : సూర్య.

ఉల్లాసంగా "శ్రీధర్" కచేరీ..

విజయవాడ : పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా "శ్రీధర్ ఈవెంట్స్" ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై సినీ సంగీత విభావరి జరిగింది. 'ఈవెంట్స్' అధ్యక్షుడు, గాయకుడు జి.మంగరాజు (రైల్వే) నాయకత్వంలో జరిగిన కచేరీలో ప్రముఖ వాస్తు సిద్ధాంతి, కళా పోషకులు తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, మీనాకుమారి, సత్య రూపాశ్రీ, బొబ్బిలి మల్లేశ్వరి, సునీత, ఇందుమతి, నడకుదురు ఝాన్సీ (ట్రాక్), మల్లేశ్వరరావు, సుజాత, డి.టి.సాయిబాబా, కె.డేవిడ్ రాజు తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు ఆయా సినిమాల్లోని హిట్ సాంగ్స్ పాడి ప్రేక్షకుల్ని అలరించారు. పరుచూరు విజయలక్ష్మి, ఎ.జయప్రభ, బండారు వెంకటేశ్వరరావు, ఎం.శ్యాంప్రసాద్ తదితరులు కూడా పాల్గొన్నారు.

పోలియో చుక్కలు తప్పనిసరి...

విజయవాడ : చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కల మందు వేయించాలని ఇందిరా మహిళా మండలి ప్రసిడెంట్ ఎం.మాధవి.. తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక రామకష్ణాపురం పరిధిలో పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ ఎం.క్రాంతి, సచివాలయం బోస్ అంగన్వాడీ టీచర్ ఐ. లక్ష్మి, ఆశ వర్కర్ హరిప్రియ, ఆయా మాధవి పాల్గొన్నారు.



కిడ్నీ బాధితులను ఆదుకోండి

●కలెక్టర్‌కు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం వినతి●గిరిజన తండాల్లో నేతల పర్యటన

విజయవాడ : కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశాకు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కిడ్నీవ్యాధుల మూలకారణాలను గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిఎంఆర్ బందాలతో రక్త నమూనాలు సేకరించాలని, ఎ.కొండూరు మండలంలోని 21 గ్రామపంచాయతీలు, 22 అనుబంధ తండాల్లో కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రధాన తాగునీటి అవసరాల కోసం కష్ణా జలాల ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని కోరారు. ముందుగా ఆదివారం ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నేతలు పర్యటించారు. దీప్లానగర్ తండా, ఎ.కొండూరు తండా, మాత్రియ తండా, చైతన్య నగర్ తండాల్లోని పలువురు కిడ్నీ బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. చక్రి నాయక్, జిల్లా అధ్యక్షుడు జటావత్ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా చక్రి నాయక్, బాలాజీ నాయక్ మాట్లాడుతూ రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న ఎ.కొండూరు మండలంలో దశాబ్దకాలంగా వందలాది మంది గిరిజనులు మూత్రపిండ వ్యాధులతో మరణిస్తున్నారని తెలిపారు. గిరిజనులు మరణించినప్పుడు ప్రభుత్వం మట్టి ఖర్చుల పేరుతో రూ.10 వేలు ఇచ్చి సరిపెడుతోందని, దీని ద్వారా సమస్య పరిష్కారం కాదని అన్నారు. డయాలసిస్ బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల పెన్షన్ కూడా సక్రమంగా అందడం లేదన్నారు.

కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వినతిపత్రం ఇస్తున్న సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు బి.చక్రి నాయక్, జి.బాలాజీ నాయక్ తదితరులు

బాధితులకు నెలకు కనీసం రూ.25 వేల పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కిడ్నీ బాధితులకు అన్ని సౌకర్యాలతో కూడిన ప్రత్యేక అంబులెన్స్, పోషకాహారం, అవసరమైన అన్ని రకాల మందులను ఉచితంగా అందించాలని కోరారు. ఎ.కొండూరు ప్రాథమిక వైద్యశాలలో ఉన్న ఆరు పడకల డయాలసిస్ కేంద్రాన్ని 15 పడకల డయాలసిస్ కేంద్రంగా విస్తరించడంతో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివద్ధి చేయాలని సూచించారు. అలానే నెఫ్రాలజీ వైద్యున్ని 24 గంటలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ దొర స్వామి నాయక్, స్టేట్ జాయింట్ సెక్రెటరీ, సేవ నాయక్, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి లాల్ నాయక్, రామకష్ణ నాయక్, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై వెనకడుగు వేయం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం, డిమాండ్ల సాధన పోరాటాలకు విజయవాడ నాందిగా నిలిచిందన్నారు. అలాంటి ఘన చరిత్ర కలిగిన విజయవాడ నగరశాఖ పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లయిన 12వ పీఆర్‌సీ ఏర్పాటు, డీఏ బకాయిల విడుదల, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు మెడికల్ రియింబర్స్‌మెంట్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నోషనల్ ఇంక్రిమెంట్, పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పునరుద్ధరణ వంటి సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టామని చెప్పారు.

నగర శాఖ నూతన కార్యవర్గం

ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ విజయవాడ నగరశాఖకు జరిగిన ఎన్నికల్లో 21 పోస్టులకు గాను ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ దాఖలైంది. అధ్యక్షునిగా సీహెచ్ సివిఆర్ ప్రసాద్ (మలేరియా విభాగం), సహాధ్యక్షులుగా పి.రాజశేఖర్ (సహకార శాఖ), కార్యదర్శిగా ఎస్.కె.నజీరుద్దీన్ (నీటిపారుదల శాఖ), కార్యనిర్వాహక కార్యదర్శిగా సిహెచ్.మధుసూదనరావు (సాంకేతిక విద్యా విభాగం), డి.ఎస్.ఎన్. శ్రీనివాస్ (వ్యవసాయ శాఖ), ఉపాధ్యక్షులుగా ఖాసిం సాహెబ్ (పశుసంవర్ధక శాఖ), ఎం.శ్రీనివాసరావు (పంచాయతీరాజ్), టి.విద్యాసాగర్ (ఐటిఐ), జి.ఎన్.వి రత్నకుమార్ (వాణిజ్య పన్నులు), మహిళా విభాగ ఉపాధ్యక్షురాలుగా బి.విజయశ్రీ (వైద్యారోగ్య శాఖ), సంయుక్త కార్యదర్శులుగా బి.నాగమల్లేశ్వరరావు (స్టేట్ ఆడిట్ శాఖ), కె.శివశంకర్ (ఆర్ అండ్‌బీ), జి.అనిల్ కుమార్ (ఎన్‌సీసీ),

నూతన కార్యవర్గానికి ఎన్నికైనట్లుగా ధృవపత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి వీవీ ప్రసాద్

ఎస్.భాస్కర నాయుడు (ఈఎస్‌ఐ), జాయింట్ సెక్రటరీగా ఎస్కే మహబూబ్ బాషా (గ్రామ, వార్డు సచివాలయాలు), మహిళా విభాగ జాయింట్ సెక్రటరీగా బి.శ్వేత (గ్రామ, వార్డు సచివాలయాలు), డీఈసి సభ్యులుగా ఎం. రాంబాబు (ఏపీజీఎల్ఐ), జి.మురళి (ఎస్ఆర్ఆర్ కళాశాల), జి.శ్రీనివాసరావు (అటవీశాఖ), ఎం.శశిధర్ (గ్రామవార్డు సచివాలయాలు), వి.దుర్గాప్రసాద్ (సిద్ధార్థ మెడికల్ కళాశాల) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వీవీ ప్రసాద్ వెల్లడించారు. సహాయ ఎన్నికల అధికారిగా జి.రామకష్ణ, పర్యవేక్షకులుగా బి.సతీష్‌కుమార్ వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, ఏపీ ఎన్‌జీజీవో మాజీ నాయకులు జి.నారాయణరావు, కంకి సత్యనారాయణ, టి.రాజారావు, ఎండీ ఇక్బాల్, కోనేరు రవి, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

పించన్ల కోసం వేడుకోలు

(మొదటి పేజీ తరువాయి)

మండలం ఐదుగుళ్లపల్లికి చెందిన ఊట్ల సీత కోరారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్)లో పనిచేస్తూ మంచుకొండల్లో ఇరుక్కుపోయి తమకు ఆసరాగా ఉండే కుమారుడు ఎస్‌కె హాడీ హుస్సేన్ చనిపోయాడని, సొంత ఇల్లులేని తమ కుటుంబానికి ప్రభుత్వం స్థలం, ఇల్లు మంజూరు చేయాలని మచిలీపట్నం ఇనకుదురుపేటకు చెందిన హుస్సేన్ తండ్రి షేక్ మహబూబ్ విజ్ఞప్తి చేశారు. మోపిదేవి మండలం మేళమర్తిలంకలో ఎస్‌సి శ్మశానవాటికకు భూములు కేటాయించాలని ఆ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ శ్రీనివాస్, తోడేటి చినబాబు తదితరులు వినతిపత్రం అందించారు. సర్వే నిర్వహించి భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు చూపుతూ సంబంధిత అధికారులు గందరగోళానికి గురిచేస్తున్నారని మచిలీపట్నం మండలం పెదయాదరకు చెందిన సన్నాల మురళీమోహన్ వాపోయారు. తనకు 57 సెంట్ల భూమి ఉంటే రీ సర్వే తర్వాత 37 సెంట్లు మాత్రమే చూపుతున్నారని, సరైన పద్ధతుల్లో రీసర్వే నిర్వహించాలని పెడన మండలం దేవరపల్లికి చెందిన జోగి వరలక్ష్మి కోరారు. కోడూరు పంచాయతీ శివారు స్వతంత్రపురం గ్రామంలోని 4.50 ఎకరాల తమ భూమిని అడంగల్‌లో ఎడబ్లూడి భూమిగా చూపుతున్నారని, దీన్ని తొలగించాలని అవనిగడ్డకు చెందిన ఐ సుబ్బారావు వినతిపత్రం అందించారు. పెడన మండలం చెన్నూరులో 15 ఎకరాల్లో అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని, ఈ భూములకు పక్కనే ఉన్న తమ భూముల్లో వ్యవసాయం సాగుకు పనికిరాకుండా పోతాయని ఆ గ్రామ మాజీ సర్పంచ్ జి.లక్ష్మిరాణి ఫిర్యాదు చేశారు. అక్రమ చెరువుల తవ్వకాలను ఆపాలని కోరారు. 2018 మసూల బీచ్ ఫెస్టివల్‌కు రూ.7 లక్షలు విలువైన పనులు చేశానని, ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని విజయవాడ కృష్ణలంక ప్రాంతానికి చెందిన వి.మాల్యాద్రి వాపోయారు. హీరోఫిన్‌కో ఆపరేటివ్ ఫైనాన్స్ కంపెనీ తన ఆధార్‌ను ఇతర లోన్‌కు అనుసంధానించిందని, ఆటో లోనుకు వెళితే బ్యాంకు అధికారులు ఇవ్వబోమని చెబుతున్నారని, అందువల్ల ఫైనాన్స్ కంపెనీపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మచిలీపట్నంకు చెందిన పుప్పాల శ్రీనివాస్ కోరారు. మచిలీపట్నం మండలం ఎస్‌ఎన్ గొల్లపాలెం అక్రక మంచినీటి కనెక్షన్లపై ఫిర్యాదు చేశారు.

బాలికపై బాలుడు అత్యాచారం

ప్రజాశక్తి - మొవ్వ : కృష్ణాజిల్లా మొవ్వ మండలం పెడసనగల్లులో దారుణం జరిగింది. ఓ బాలికపై బాలుడు అత్యాచారం చేసిన సంఘటన వైద్యుని సమాచారంతో ఆలస్యంగా వెలుగుచూసింది. ఐదేళ్ల బాలికపై పదమూడేళ్ల బాలుడు లైంగిక దాడిచేశాడు. ఆదివారం సాయంత్రం 4:30 గంటల సమయంలో కేక్ ఇస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. సోమవారం ఉదయం పాప నొప్పిగా ఉందని ఏడుస్తూ ఉండడంతో గమనించిన తల్లిదండ్రులు కూచిపూడిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యుడు అత్యాచారం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 229 అర్జీలు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజల సంతప్తే సేవల్లో నాణ్యతకు గీటురాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో నిబద్ధతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జగిరిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలిసి అర్జీలు స్వీకరించారు.

మహాత్మునిపై విద్వేషం

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు మాట్లాడారు. వామపక్షాల జిల్లా నాయకులు పి.వి.ఆంజనేయులు, కోట కళ్యాణ్, బోయి సత్య బాబు, నక్కా వీరభద్రరావు, ఇవి నారాయణ, సూరిబాబు, సుబ్బారెడ్డి, గాదే ఆదిలక్ష్మి, పి.దుర్గాంబ, లంక దుర్గారావు, నూలి సాంబశివరావు, రామకష్ణ, ఈశ్వర్, కొట్టు రమణ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో సిపిఎం నిరసన

విస్సన్నపేట : వికసిత్ భారత్ జి రామ్ జి చట్టం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం విస్సన్నపేటలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పేరు మార్పును, రాష్ట్రాలపై నిధుల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఉపాధి చట్టం సంస్కరణలను ఉపసంహరించుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం విస్సన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, మండల కమిటీ సభ్యులు గద్దల రామకష్ణ, చిట్టిబాబు, కొండ, సిఐటియు మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు, అప్పారావు, గంజినబోయిన రాము, బాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి మార్కుల జాబితా పోయినది

అవనిగడ్డ మండలం, అవనిగడ్డ 2వ వార్డు, బి.సి. కాలనీకి చెందిన దొవ శేషగిరిరావు **S/o** మోహనరావుకు చెందిన 10వ తరగతి ఒరిజినల్ మార్కుల లిస్టు పోయినది. ఈనెల 5వ తేదీన మార్కుల జాబితాను ఫొటోస్టాట్ తీయించుకొను నిమిత్తం హ్యాండు బ్యాగు నందు వుంచి తన ద్విచక్ర వాహనం ట్యాంకు కవరులో వుంచి, ఆర్‌టిసి బస్టాండ్ వద్ద బండి నిలిపి, కూరగాయలు కొనుగోలు చేయు నిమిత్తం వెళ్ళి వచ్చేసరికి ట్యాంకు కవరులో వున్న హ్యాండుబ్యాగు కనిపించలేదు. అందువల్ల ఎవరికైనా దొరికిన యెడల దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగలరు. లేదా నా ఫోన్ నెం. 97040 79937కు ఫోన్ చేసి చెప్పగలరు.

ఇట్లు
దొవ శేషగిరిరావు, S/o మోహనరావు,
2వ వార్డు, బి.సి. కాలనీ, అవనిగడ్డ.
అవనిగడ్డ మండలం, కృష్ణా- 521121

యూజీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేట్ (యూ జీ) మూడు, నాలుగు సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కూన రాంజీ సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా ఎన్ ఉష, పరీక్షల నియంత్రణా ధికారి డా. పి. వీర బ్రహ్మాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పరీక్షల నిర్వహణ పారదర్శకంగా, సక్రమంగా జరిగిందని తెలిపారు. పరీక్షల నియంత్రణాధికారి డా. పి. వీర బ్రహ్మాచారి వివరాలు తెలియజేస్తూ యూ జీ మూడవ సెమిస్టర్‌లో మొత్తం 51.85 శాతం, యూజీ నాలుగవ సెమిస్టర్‌లో 66.31 శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు.. ఫలితాలు కష్ణా విశ్వవిద్యాలయం అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మాట్లాడుతున్న డి. సుధారాణి

సేంద్రీయ వ్యవసాయంతోనే నేల ఆరోగ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : రసాయన ఎరువుల మితి మీరిన వాడకం వల్ల నేల సహజత్వాన్ని కోల్పోతోందని, సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు మళ్లాల్సిన అవసరం ఉందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. డి. సుధారాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేవీకేలో రైతులకు 'సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు' అనే అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువులపై పూర్తిగా ఆధారపడటం వల్ల నేలలో మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తున్నాయని, సేంద్రీయ కార్బన్ శాతం పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సేంద్రీయ ఎరువులు ఎంతో మేలు చేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సస్యపోషణ శాస్త్రవేత్త ఎం. వెంకటలక్ష్మి, ర్రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సహకార సంఘ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎదుట కష్ణా, ఎన్‌టి ఆర్,జిల్లాల సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జె.రామాంజనేయులులు మాట్లాడుతూ జి.ఓ. నెం.36ను తక్షణమే అమలు చేసి, 2019, 2024కు సంబంధించిన పెండింగ్ వేతన సవరణలు చేయడంతో పాటు, అప్పటివరకు మధ్యంతర భతి చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ సిలింగ్ పేరుతో రూ.2 లక్షలకే పరిమితం చేస్తున్న విధానాన్ని రద్దు చేసి, గ్రాట్యుటీ చట్టం ప్రకారం పూర్తి గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలుగా అమలు చేయాలన్నారు. ధర్నాకు సిఐటియు జిల్లా కార్యదర్శి బూర సుబ్రమణ్యం సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ ధర్నా లో సహకార సంఘాల ఉద్యోగుల సంఘ నాయకులు, రాష్ట్ర నాయకులు సిహెచ్ రవికుమార్ జిల్లా అధ్యక్షులు తోట కృష్ణారావు, కృష్ణాజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై వి వి రామ్మోహన్రావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కొండపల్లి శర్మ, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ రావు, ఏలూరు జిల్లా సెక్రెటరీ శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు జి ఎన్ వి రామారావు పాల్గొన్నారు.

మీకోసం అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందే మీకోసం అర్జీలను, ఉద్యోగుల సమస్యలను ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ హాలులో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ ఓ కే చంద్రశేఖర రావు, కెఆర్ఆర్‌సిఎస్ డి సి శ్రీదేవి, మెప్మా పిడి సాయిబాబు, డిఎస్పి శ్రీనివాసరావులతో కలిసి మీకోసం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. అంతకుమునుపు ఉద్యోగుల గ్రీవెన్స్ దినం నిర్వహించి ఉద్యోగుల నుండి అర్జీలు స్వీకరించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ లోకేష్, డిఆర్‌డిఏ పి డి హరిహరనాథ్, డిఎస్ఓ మోహన్ బాబు, డిపిఓ డాక్టర్ జె అరుణ తదితరులు పాల్గొన్నారు.అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "మీ కోసం" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు పాల్గొని ప్రజల నుండి ప్రజల నుండి అర్జీలు స్వీకరిం చారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా మొత్తం 40 ఫిర్యాదులు అందాయని ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : అధికార బలంతో కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల పక్షాన పోరాడే నాయకుడు పేర్ని వెంకటరామయ్య కృష్ణా జిల్లా ప్రజలకు అండగా ఉంటారని పెడన నియోజవర్గ వైఎస్ఆర్సిపి కన్వీనర్ ఉప్పల రాము పేర్కొన్నారు. సోమవారం నాని పుట్టినరోజు సందర్భంగా మచిలీపట్నం కోనేరు సెంటర్లో అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు. మచిలీపట్నం నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోక వెంకటేశ్వరమ్మ, నగర పార్టీ అధ్యక్షులు మేకల సుబ్బన్న, మచిలీపట్నం డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ సిలార్ దాదా పాల్గొన్నారు. అనంతరం కోనేరు సెంటర్లో అన్నదానం నిర్వహించారు.

మత్తు మందిచ్చి బంగారు ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని పురిటిగడ్డ గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ దంపతులు బెజవాడ శివరామకష్ణ ప్రసాద్ లీలాకుమారిలకు పానకంలో మత్తు మందు కలిపి బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చల్లపల్లి పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం ఒక వ్యక్తి బాధితుల ఇంటికి వచ్చి, మంగళగిరి పానకాలస్వామి గుడి నుండి పానకం తెచ్చానని నమ్మబలికాడు. ఆ పానకంలో మత్తుమందు కలిపి వారికి ఇచ్చి తాగించాడు. పానకం తాగిన వెంటనే దంపతులు స్పహతప్పి పడిపోవాటంతో నిందితుడు లీలాకుమారి మెడలోని 5 నవర్ల బంగారు తాళిబొట్టు గొలుసు, 3 నవర్ల బంగారు గాజులు, ఒక వెండి ప్లేటు, వెండి కలశం చెంబును దొంగిలించాడు. దొంగతనం చేసిన వ్యక్తి వారం రోజుల క్రితమే బాధితుల ఇంటి వెనుక ఉన్న పోర్షన్‌లో అద్దెకు ఉండేందుకు వచ్చి, రూ. 2,500 అడ్వాన్స్ కూడా ఇచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధులను పొరుగువారు చూసి ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వారు చల్లపల్లిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల కుమారుడు కుమారుడు భవానీ కిషోర్ ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్ఐ కె.వై.దాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం : సిఐ

ప్రజాశక్తి-గుడివాడ : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత జీవితం నాశనం అవుతుందని వన్‌టౌన్ సిఐ హనీష్ అన్నారు. స్థానిక నలంద్ర మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. సోమవారం నలంద్ర పాఠశాలలో శక్తి టిమ్ సభ్యులతో కలసి బాలలపై జరిగే నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు, సైబర్ మోసాలపై, బాల్య వివాహాలు, డిజిటల్ అరెస్టులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నేడు కొండలమ్మ దేవస్థానంలో వేలంపాటలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేవమరం కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో మంగళవారం కొన్ని హక్కుల లైసెన్సులను పొందే నిమిత్తం బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఈఓ ఆకుల కొండలరావు సోమవారం విలేకరులకు తెలిపారు. శ్రీ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో సొంత కెమెరాతో ఫోటోలు తీసుకొను లైసెన్సు హక్కుతో పాటు అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన మినుములు అమ్మకం లైసెన్సు హక్కు పొందేందుకు ఈ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రైతులు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : పంట నమోదు, ఈ కేవైసీ అందరూ తప్పక చేయించుకోవాలని పమిడిముక్కల మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పైడికొండలపాలెం గ్రామంలోని వ్యవసాయ పొలా లను ఆయన సందర్శించి రైతులకు సూచనలు చేశారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంట నష్టం ఇన్సూరెన్స్ ద్వారా వస్తుందని రైతులందరూ ఈకెవైసి చేయించుకోవాలని తెలిపారు. పంటలకు తగు మోతాదుల్లో పురుగుమందులు చల్లాలని సూచించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక సత్యనారాయణపురంలోని వికాస్ రైన్ బో స్కూల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ రైన్ బో పాఠశాల ఆవరణలో క్రిస్మస్ అలంకరణలతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ, నత్య ప్రదర్శనలు చేస్తూ అందరినీ అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పుట్టి రామచంద్రశేఖర్, ప్రధాన ఉపాధ్యాయురాలు అరుణ, ఇంచార్జ్ వాణి, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కొండేటి ఇందిర,కష్ణా జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ వేమూరి పరిశుద్ధ రాజు, మొవ్వ మండలం పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ అప్పికట్ల ఇమ్మానుయేల్, ఎంపీడీవో దయాల సుహాసిని తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో మెగా సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బాల యేసు జన్మించిన పశువుల పాక అలంకరణ వీక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా యేసుక్రీస్తు జన్మ వత్తాంతాన్ని తెలిపే పలు నాటికలు ప్రదర్శించారు. పాదర్ సుధాకర్, స్కూలు కరస్పాండెంట్ మౌలి థామస్, ప్రిన్సిపాల్ లూర్దు మేరీ, వైస్ ప్రిన్సిపాల్ మౌని మార్ట్ యు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ప్రేమ, దయ, కరుణ గుణాలను బోధించే ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్రాజా అన్నారు. ఉయ్యూరు సీబీసీఎన్సీ చర్చిలో సోమవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ పమిడిముక్కల మండల నాయకుడు లింగమనేని బాబూరావు, దైవ సేవకులు రెవరెండ్ మార్క్ పాల్, రెవరెండ్ జి. మాసిలామణి రెవరెండ్ సత్యనారాయణ, పాల్ రెవరెండ్ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో మాట్లాడుతున్న వర్ల కుమార్ రాజా

అవనిగడ్డలో...

గుడివాడలో...

మోసం చేసిన నిందితులకు ఏడాది జైలు

ప్రజాశక్తి-విజయవాడ: ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసులలో నిందితులకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. విశాఖపట్నం చోడవరం ఏరియాకు చెందిన రెడ్డి గౌతం, అతని భార్య లోచిని విజయవాడ పటమట ఏరియాలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదిదారులను పరిచయం చేసుకుని వారికి వివిధ నాయకులతో , ప్రముఖులతో దిగిన ఫోటోలను చూపిస్తూ వారితో పరిచయం ఉన్నట్లు, వివిధ శాఖలలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు ఇప్పిస్తాను అని నమ్మించి వారి వద్ద నుండి రూ. రెండు లక్షలు చొప్పున తీసుకున్నట్లు, తరువాత ఉద్యోగం వచ్చినట్లు ఒక అపాన్మెంట్ లెటర్ ఇచ్చి మిగిలిన రెండు లక్షలను ఇవ్వమని అడుగగా అతని భార్య అయిన లోచినికి ఇచ్చినట్లు, తరువాత ఉద్యోగం లోనికి జాయిన్ అవ్వడానికి వెళ్లగా అది ఫేక్ లెటర్ అని చెప్పగా మరలా వెళ్లి అడగగా వాళ్ళు తెలుసు వీళ్ళు తెలుసు అని ఫోటోలను చూపిస్తూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇచ్చిన రెండు ఫిర్యాదులపై అప్పటి సత్యనారాయణ పురం ఎస్.ఐ. కె.జి.వి.సత్యనారాయణ కేసులు నమోదు చేసి విచారించారు.2020 సెప్టెంబర్ 27న నిందితులైన విశాఖపట్నం చోడవరం గ్రామానికి చెందిన రెడ్డి గౌతం , అతని భార్య ఇల్లంటి లోచిని లను అరెస్ట్ చేసి కోర్ట్ లో హాజరు పెట్టి, చార్జీషీట్ దాఖలు చేశారు.విచారణ అనంతరం, నిందితులైన విశాఖపట్నం చోడవరం గ్రామానికి చెందిన రెడ్డి గౌతం , అతని భార్య ఇల్లంటి లోచిని లపై నేరం ఋజువైనందున సోమవారం మూడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జ్ ఎస్.కె.రహనా నిందితులకు రెండు కేసులలో ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష రూ.4 వేలు చొప్పున మొత్తం ఏకకాలంలో ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-జి.కొండూరు: విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో 45.1/1లో అనుమతులు తీసుకోని ఆ పక్కన ఉన్న భూముల్లో అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కొత్తూరు తాడేపల్లి వాసి మెండెం జమలయ్య జేసీ ఇలాక్కియాకు పిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేటు జరిగిన పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. అక్రమ తవ్వకాల పై రెండు సార్లు పిర్యాదు చేసిన అధికారుల నుంచి స్పందన లేదని, దీన్ని ఆసరాగా చేసుకొని సర్వే నెంబర్ 46 ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలు చేస్తున్నారని, రెవిన్యూ అధికారులు కూడా చూసి చూడనట్లు ఉంటున్నారని ఆమె దష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో తాడేపల్లి 244 సర్వే నెంబర్ లో ప్రభుత్వ భూమి, వసంత రాయలతిప్ప, దొండతిప్ప ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు చేసిన వారిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకో లేదని వారి పై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు నిలిపి వేసి తవ్వకాలకు సహకరిస్తున్న అధికారుల పై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించాలని కోరారు.

రామిరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలంలోని యోగి వేమారెడ్డి నిత్యాన్నదాన సత్రం గౌరవ అధ్యక్షుడిగావైసిపీ సీనియర్

నేత సూరసాని రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సూరసాని రామిరెడ్డికి సోమవారం అభినందన సత్కారం జరిగింది. రామిరెడ్డిని వైసిపి కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, పార్టీ నాయకులు చెరుకుపల్లి సుబ్బారెడ్డి, దేవిరెడ్డి ఆంజనేయరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కేసరి కష్ణారెడ్డి, మల్లెల శ్రీనివాస రెడ్డి, మూలె కొండారెడ్డి, గుజ్జుల వెంకటరెడ్డి, కాపులపల్లి చిన్నారెడ్డి, వై దశథరామిరెడ్డి, యోగి వేమారెడ్డి పాల్గొన్నారు.

వైసిపి నేతలపై కేసు నమోదు

ప్రజాశక్తి-తిరువూరు: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 20వ తేదీన తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం నిర్వహించిన వైసీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతులు తీసుకోకుండా గుంపులుగా వైసీపీ నాయకులు వచ్చి పెద్ద గా అరుస్తూ రక్తదాన శిబిరం నిర్వహించారని ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ సెక్యూరిటీ గార్డు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాసుతో పాటు మరో 20 మందిపై కేసు నమోదైంది. రక్తదాన శిబిరాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి చెందిన వైద్యులు సిబ్బంది వచ్చి 95 మంది దాతల నుండి రక్తాన్ని సేకరించారు. ప్రభుత్వ ఆసుపత్రి అధికారులే వచ్చి రక్తాన్ని దాతల నుండి సేకరిస్తే అది కేసు ఎలా అవు తుందని స్వామిదాస్ మండిపడ్డారు.

శీతాకాలంలో చర్మ సంరక్షణ అవసరం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: శీతాకాలంలో చర్మ సంరక్షణ అవసరమని పోషకాహార నిపుణురాలు రితికా సమద్దర్ అన్నారు. నగరంలోని వో హోటల్లో జరిగిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతూ కొవ్వు పట్టిన చేపలు, కాలిఫోర్నియా బాదం వంటి ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఈ, ఒమేగా-3 అధికంగా ఉండే ఆహారాల ప్రాముఖ్యతను వివరించారు. రోజువారీ ఆహారంలో బాదంను చేర్చుకోవడం వల్ల చర్మానికి లోపలి నుండి పోషణ అందించవచ్చన్నారు. కఠినమైన వాతావరణ పరిస్థితులలో కూడా చర్మం మదువుగా, హైడ్రేటెడ్‌గా, ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుందని తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎల్‌హెచ్‌ఆర్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-మైలవరం. దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ ఫుట్బాల్ పోటీలకు మైలవరం ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు రోజులుగా విజయవాడలో కష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఫుట్బాల్ పోటీలు జరిగాయన్నారు. పోటీలలో తమ కళాశాలకు చెందిన తరుణ్ కుమార్, జోయ్ లు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి అంతర్ విశ్వవిద్యాలయ ఫుట్బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 23 నుంచి యూనివర్సిటీ ఆఫ్ కాలి కట్ కేరళ లో, నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ ఫుట్బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ఇబ్రహీంపట్నంలో...

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : స్థానిక బ్రాహ్మణ వీధిలోని వైసిపి కార్యాలయంలో సోమవారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ముందస్తు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బూదాల శ్రీను ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి, 34, 55 డివిజన్ కార్పొరేటర్లు బండి పుణ్యశీల, శిరంశెట్టి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** కతనకొండ గ్రేస్ చర్చిలో సోమవారం వినూత్న పద్ధతిలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి, కంచికచర్ల విజయవాడ పరిధిలో బస్టాండ్ లో రోడ్ల మీద సంచరిస్తున్న సుమారు 20 మంది యాచకులను గుర్తించి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఎలీషా, సుమలత, యోహాను తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మండలంలోని మల్కాపురం గ్రామంలో లెమన్స్ ఇవాలంగికల్ ఫెలోషిప్ (ఎల్‌ఈఎఫ్) చర్చి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సంఘ కాపరి టి.బాబురావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు, యువకులు, మహిళలు పాటలు, నృత్యాలతో పాటు అన్వేషణ, యేసు పుట్టుక వంటి స్కిట్లు ఆహుతులను అలరించాయి. అనంతరం జగ్గయ్యపేట ఎల్‌ఈఎఫ్ పాస్టర్ శాంసన్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ప్రేమ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జయంతిరావు, రాజారావు పాల్గొన్నారు.

జగన్ మోసాలను ప్రజలు మరిచిపోలేదు : కిరణ్

ప్రజాశక్తి -విజయవాడ సిటీ : వైసిపి ప్రభుత్వ పాలన ఐదేళ్లల్లో జగన్మోహన్‌రెడ్డి చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదని ఏపీ నగరాల సామాజిక వర్గం అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టర్ సుకాశి కిరణ్ చెప్పారు.

ఆదివారం పాతబస్తీ నెహ్రూబొమ్మ కూడలిలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను జగన్ మోసం చేశారని పేర్కొన్నారు. ప్రజల నుంచి వైసిపి నేతలకు ఎదురవుతున్న వ్యతిరేకతను పక్కదారి మళ్లించేందుకే ఆ పార్టీ నేతలంతా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి శాంతిభద్ర తలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

కమిషనర్‌ను కలిసిన 42 ప్లాట్ల బాధితులు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: భవానీపురం జోజినగర్ 42 ప్లాట్ల బాధితులు, వైసీపీ నేత పోతిన వెంకట మహేష్ విఎంసి కమిషనర్ ధ్యానచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం విఎంసి ఛాంబర్ వద్ద కమిషనర్ ను కలసిన పోతిన మహేష్ 42 ప్లాట్ల స్థలం గుండా అపార్ట్మెంట్ వాసులు, పలు ఇళ్ల యజమానులకు 2012 లోప్రధాన రహదారిని రెగ్యులరైజ్ చేసిన విధానాన్ని వివరించారు. ఎస్ కే టి వెస్ట్ మెడోస్ అపార్ట్మెంట్ సహా పలువురు స్థల యజమానులకు విఎంసి అధికారులు అనుమతులు మంజూరు చేశారని గుర్తుచేసారు. ఈ అంశం పై కమిషనర్ సానుకూలంగా స్పందించారని న్యాయ సలహా తీసుకొని భాదితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చిన్నట్లు పోతిన మహేష్ పేర్కొన్నారు.ఈ క్రమంలో వెస్ట్ మేడోస్ అపార్ట్మెంట్ ప్లాట్ యజమానులు బేవర సాయి సుధాకర్, ఇల్లా భాస్కర్, గంజి జోషి రహదారి కోసం అనుమతులు మంజూరు చేసిన అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: కొత్తపేట తేలప్రోలు రాజా హైస్కూలుకు చెందిన 1966-71 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరవేస్తూ ఆదివారం పున్నమి హోటల్ లో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా బెజవాడ రాజారావు హైస్కూలు వ్యవస్థాపకులు బెజవాడ రాజారావుకు ఆత్మీయ సత్కారాన్ని అందజేశారు. తమ పూర్వ విద్యార్థులు ఉన్నత పదవులను అలంకరించడం గర్వించ దగ్గ విషయమని ఈ సందర్భంగా బెజవాడ రాజారావు సంతోషం వ్యక్తం చేశారు. మరో ఉపాధ్యాయులు మొగుళ్లూరి వెంకట పేరయ్యను సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు రాజ్ భవన్ విశ్రాంత ఉద్యోగి పోలమరశెట్టి రమణరావు, సింగరేణి కాలరీస్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ బుర్రా దత్తాత్రేయ శాస్త్రి, ఎస్బిఐ విశ్రాంత ఉద్యోగి వెంకటేశ్వరరావు, మాణిక్యాలరావు, భాస్కర్, బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ ఏజీఎం పోతరాజు రమణారావు, ఎస్‌బిఐ రిటైర్డు మేనేజర్ గోపాలకృష్ణ, బొయన రాములు, విఆర్ సిద్దార్థ రిటైర్డు ల్యాబ్ అసిస్టెంట్ ఆర్‌వి రమణరావు, వ్యాపార ప్రముఖులు వాసుదేవరావు, దుర్గాప్రసాద్ ఉన్నారు.

క్రీడల్లో షైన్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ :డిసెంబరు 14వ తేదీన చిలకలూరి పేటలో జరిగిన స్థాయి కరాట్, కుంగ్ ఫూ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించినట్లు కెబిఎన్ షైన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.నరేంద్ర కుమార్ చెప్పారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో నరేంద్ర మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎస్.బి. సాయిశ్రీ కుంగ్ ఫూ పోటీల్లో, ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎస్.బాలసుబ్రహ్మణ్యం కరాటే పోటీల్లో జాతీయ స్థాయి బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ సాధారణ విద్యతో పాటు తమ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి విద్యార్థులను అభినందించారు.

కోయ సుధకు పురస్కారం

ప్రజాశక్తి-మైలవరం: మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధకు 2025 అమరావతి విశిష్ట సేవ పురస్కారం లభించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాద్ సారధ్యంలో అమరావతి విశిష్ట సేవా పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం సందర్భంగా ఈ పురస్కారాన్ని కోయ సుధఅందుకున్నారు. ఈ సందర్భంగా కోయసుధను మైలవరంలోని మదర్ తెరిసా ట్రస్ట్ కార్యాలయంలో పలువురు ఆమెను అభినందించి ఘనంగా సత్కరించారు.

నేత్ర సంరక్షణలో ఆక్యులోప్లాస్టీ కీలకపాత్ర

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్సిటీ

నేత్ర వైద్య చికిత్సలో ఆక్యులోప్లాస్టీ అనేది ప్రత్యేకమైన విధానమని, నేత్ర సంరక్షణలో ఆక్యులోప్లాస్టీ అండ్ ఫేషియల్ కీలక పాత్ర పోషిస్తుందని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యులు, విజయవాడ క్యాంపస్ హెడ్ మరియు కన్సల్టెంట్ ఆక్యులోప్లాస్టి సర్జన్ డాక్టర్ అనసూయ గంగూలీ కపూర్ తెలిపారు. ఈ మేరకు ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కోడె వెంకటాద్రి చౌదరి ప్రాంగణంలో సోమవారం ఆక్యులోప్లాస్టీ అండ్ ఫేషియల్ చికిత్సపై జరిగిన వర్క్ షాప్ లో ఆమె మాట్లాడుతూ కంటి రెప్పలలో సంభవించు లోపాలు, కంటి నుంచి నీరు కారటం, కంటి పరిసరాలలోని లోపాలు, దృష్టి పని తీరు, కంటి రూపాన్ని సవరించుటలో ఆక్యులో ప్లాస్టి చికిత్స కీలక పాత్రను పోషిస్తుందన్నారు. ఆక్యులోప్లాస్టి కంటి భాగాల నిర్మాణంలోను మరియు కంటి దృశ్య శాస్త్రంలోనూ సంపూర్ణమైన అవగాహన కలిగి ఉంటుందని, ఆక్యులోప్లాస్టి మరియు ఫేసియల్ రెండును చికిత్సలో అనుసంధానత కలిగి కంటి లోపాలను సవరిస్తుందన్నారు. వృద్దాప్యం కారణంగా కంటి చుట్టూ ఏర్పడే ఛాయలను బొటోలినమ్ టాక్సిన్ ఇంజక్షన్లు మరియు డెర్మల్ ఫిల్లర్ సహాయంతో పరిష్కరించవచ్చన్నారు.

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కుట్ర

- సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై. నరసింహారావు

మాట్లాడుతున్న వై. నరసింహారావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం దేశంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేయడం కోట్లాదిమంది గ్రామీణ పేదలకు నష్టం చేయడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు విమర్శించారు. సోమవారం అవనిగడ్డ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేస్తూ విబి రాంజీ పథకంగా మార్పు చేయడం తో ఇప్పటివరకు గ్రామీణ పేదలకు జరుగుతున్న మేలు కు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. 2004లో యూపీఏ -1 ప్రభుత్వాన్ని బలపరిచిన కమ్యూనిస్టుల ఒత్తిడితో 2005 నుండి మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చింది అన్నారు. తొలిసారిగా గ్రామీణ పేదలకు కొన్ని పరిమితులతో అయినా ఉపాధి గ్యారెంటీ కల్పించిందన్నారు. 100 రోజులు ప్రతి కుటుంబానికి పని చూపించడం, అడిగిన వారందరికీ పని కల్పించడం, పని చూపలేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇవ్వడం, వేతనాలు చెల్లింపులు అవని పక్షంలో వడ్డీతో కలిపి ఇవ్వడం లాంటి అంశాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ పనులు లేని రోజులలో గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం, ఆదాయం సమకూర్చిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం లాంటి అభివద్ధి కార్యక్రమాలకు ఈ పథకం తోడ్పడిందన్నారు. అయితే వీటన్నిటిని నిర్వీర్యం చేస్తూ కొత్త పథకంలో కేంద్రం కేటాయించిన నిధుల మేరకే పని చూపడం జరుగుతుందన్నారు. ఈ చట్టం నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. గతంలో కేంద్ర రాష్ట్రాలు కలసి 90 శాతం కేంద్రం, 10 శాతం రాష్ట్రాల వాటాగా ఉండగా దానిని 40 శాతం రాష్ట్ర వాటాగా పెంచడంతో రాష్ట్రాలపై భారం పెరుగుతుందన్నారు. అందువల్ల గ్రామీణ పేదలకు నష్టం కలిగించే ఈ కొత్త పథకం ఉపసంహరించుకొని, పాత పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు శీలం నారాయణరావు, సిపిఎం నాయకులు యద్దనపూడి మధు, పాల బత్తిన మోహన్ రావు, ఎండి కరిముల్లా పాల్గొన్నారు.

ప్రదర్శనలు పరిశీలిస్తునన డిఇఒ సుబ్బారావు

విద్యార్థుల జీవితంలో గణిత విజ్ఞానం కీలకం : డిఇఒ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : విద్యార్థుల జీవితంలో వైజ్ఞానిక దక్పథం మరియు గణిత విజ్ఞానం అత్యంత కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు పేర్కొన్నారు.జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన మరియు జాతీయ గణిత దినోత్సవం వేడుకలు సోమవారం స్తానిక లేడి ఆంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జిల్లా విద్యాశాఖా ధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ, శాస్త్రీయ ఆలోచన విద్యార్థుల్లో తార్కిక శక్తిని, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక విజ్ఞానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థులలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, పరిశోధనా ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో పాఠశాలలో మొత్తం 196 వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి దుర్గా ప్రసాద్ , డిసిఈ బి సెక్రటరీ విజయ్ , గరికపాటి గోపీచందు , లేడి ఆంప్తిల్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ, విద్యార్థులు .పాల్గొన్నారు.

హాస్టల్‌కు సీలింగ్ ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైని హైస్కూల్ మెయిన్ క్యాంపస్ బాయ్స్ హాస్టల్ లో చిరంజీవులు చంద్రజ్ చౌదరి, శ్రీరాజ్ చౌదరి పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు కన్నెగంటి అనిల్ కుమార్, వందన సహకారంతో పదివేల రూపాయల విలువైన ఆరు సీలింగ్ ఫ్యాన్లను సోమవారం హాస్టల్ వార్డెన్ అశోక్ కి అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణుకుమార్, ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, గౌరవ సభ్యులు అనిల్, ఎం ఎస్ ఎన్ వి ప్రసాద్, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతులకు తొలివిడత సొమ్ము చెల్లింపు

చెరకు రైతులకు తొలివిడత చెల్లింపు వివరాలు తెలియచేస్తున్న కేసీపీ కర్మాగార హెడ్ సీతారామదాస్

ప్రజాశక్తి-ఉయ్యూరు : చెరుకు రైతుల అభివద్ధి, సంక్షేమం కోసం కేసీపీ చక్కెర కర్మాగార యాజమాన్యం కట్టుబడి ఉందని కర్మాగార యూనిట్ హెడ్ వై. సీతారామదాస్ అన్నారు. 2025-2026 సంవత్సరానికి చెరకు తోలిన రైతులకు 15 రోజుల్లో తొలివిడతగా టన్నుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.3,290 చొప్పున సోమవారం చెల్లింపు వివరాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చక్కెర కర్మాగారం స్థాపించిన నాటి నుండి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల చెరుకు రైతుల అభివృద్ధికి, ఆయాప్రాంత వాసుల సంక్షేమానికి కృషి చేసిందన్నారు. చెరుకు సాగు పెంచేందుకు కర్మాగార యాజమాన్యం అందజేస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకుని రానున్న సీజన్కు ఎక్కువ విస్తీర్ణంలో చెరుకు సాగుచేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేన్ జీఎం పున్నారావు, డీసీఎం వెంకటేశ్వర్లు, సంపత్కుమార్, నరేంద్ర కుమార్, అనీస్, చెరుకు రైతుల సంఘం నాయకులు ఎస్వి కష్ణారావు, వెంకటేశ్వరరెడ్డి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : రైతుకు మెరుగైన ఆదాయం కల్పించినపుడే అసలైన అభివద్ధి సాకారమై నట్లు అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఏపీ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన రెండు గోదాముల నిర్మాణానికి సోమవారం మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. పంట పండించిన రైతు గిట్టుబాటు ధర వచ్చే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు వీలుగా మార్క్ ఫెడ్ పని చేస్తోందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో తొలిసారి రూ.6.50 కోట్ల వ్యయంతో మచిలీపట్నంలో గోదాములు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కార్పొరేటర్ అనిత, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె నాని, తదితరులు పాల్గొన్నారు

నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికీ రోడ్డు వేయిస్తా : కొల్లు

నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి మెరుగైన రోడ్డు సదుపాయం కల్పించి తీరుతానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని మూడు స్తంభాల నేషనల్ హైవే 65లో భాగంగా ఉన్న మూడు స్తంభాల సెంటర్ నుండి కోనేరు సెంటర్ వరకు ఉన్న 1.20 కిలోమీటర్ల రోడ్డు అభివద్ధి పనులకు మంత్రి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు రూ.1.38 కోట్ల వ్యయంతో 10 మీటర్ల వెడల్పులో రోడ్డును విస్తరించబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-చల్లపల్లి : బాల్య వివాహాలు చేయటం వలన మాతృ మరణాలు శిశు మరణాలు జరుగుతాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ ఆదిలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని నడకుదురు రోడ్డులో గల సెయింట్ మదర్ థెరిసా పాఠశాలలో సోమవారం బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ వందరోజుల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ మొవ్వ ప్రాజెక్టు సీడీపీఓ విశ్వనాథ ప్రసన్న ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని బాల్యవివాహాలు చేయకుండా చూడటం మన అందరి బాధ్యత అన్నారు. బాల్య వివాహం జరుగుతుందని తెలిసిన యెడల హెల్ప్ లైన్ 1095, 181, 100,112 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, అంగన్వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, దుర్గ, శివకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్ ఆదిలక్ష్మి

11న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కోడూరు : ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు అవ్వాలని లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ అధ్యక్షులు పూతబోయిన అయ్యప్ప స్వామి అన్నారు. సోమవారం కోడూరులో పాత్రికేయులతో మాట్లాడుతూ లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థ స్థాపించి 23 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కోడూరులో 14 వ మెగా రక్తదాన శిబిరాన్ని జనవరి 11న నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సభ్యులు మాచర్ల నారాయణ, బడే నాని, బండే జయ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలో మాచవరం ప్రాంతంలో నివాస్తున్న సంచార జాతుల వారికి బెరాక మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్ సోమవారం నిత్యవసర వస్తువులను అందజేశారు. సుమారు 50 మంది సంచార జాతులు వారికి రగ్గులు, నిత్యవసర వస్తువులను అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కిరణ్ పాల్ మాట్లాడుతూ రానున్న పండగల దృష్ట్యా పలు ప్రాంతాల్లో సంచరించే వారికి ఉపయోగపడే ఉపకరణాలను అందజేసినట్లు తెలిపారు. .అలాగే సమాజంలో మిగిలిన సేవా సంస్థలు కూడా వీరిపై ప్రత్యేక దష్టి పెట్టి చదువులకు ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలని అదేవిధంగా సామాజిక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాగేశ్వరావు సూరత్ చందు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి కె. రాంజీ

జాబ్‌మేళాలో 140 మంది ఎంపిక

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో సోమవారం మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించారు. ఎనిమిది కంపెనీలకు చెందిన ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు చేపట్టారు. బిటెక్, బి ఫార్మసీ, ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థుల తోపాటు పిజి విద్యార్థులు మూడు వందలమంది హాజరు కాగా నూట నలభై మంది ఎంపికయ్యారు. మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సమన్వయం తో నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్ లో ఎంపికైన వారికి ఉపకులపతి ఆచార్య కె. రాంజీ చేతుల మీదుగా నియామక పత్రాలు అందచేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ట్రైనింగ్, ప్లేస్మెంట్ సెల్ సమన్వయకర్త ఆచార్య వైకే సుందర కష్ణ, డైరెక్టర్లు డా. కిషోర్, డా. హనుమంతరావు, డా. అలీ మీర్జా, కృష్ణ, విజయశేఖర్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

లంక నరేంద్రకు అభినందనలు

ప్రజాశక్తి-పామర్రు : యుటిఎఫ్ కృష్ణా జిల్లాశాఖ కార్యదర్శిగా లంక నరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి గా పామర్రు మండలం కనుమూరు గ్రామంలో మోడల్ ప్రైమరీ స్కూల్ నందు ప్రధానోపా ధ్యాయుడిగా పనిచే స్తున్న లంక నరేంద్రను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంపట్ల పామర్రు యుటిఎఫ్ మండల శాఖ, పలువురు ఉపాధ్యాయులు, యుటిఎఫ్ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

'లిటిల్ బ్రెయిన్స్'లో వేడుకలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: స్థానిక సిద్ధార్థ నగర్ నందు గల లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ 138వ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులు గణిత నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధా ప్రవీణ ముక్కేవి విద్యార్థులను ఉద్దేశించి గణితం యొక్క ఆవశ్యకత మరియు భవిష్యత్తులో గణితము యొక్క మెళకువలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు ఫణిప్రసాదు ముక్కేవి ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు.

దోమల నివారణకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని ఈట్ స్ట్రీట్, ఎంజి రోడ్డు, డివి మేనర్ రోడ్డు, లబ్బీపేట తదితర ప్రాంతాల్లో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దోమల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. యాంటి లార్వా ఆపరేషన్లనిత్యం జరుగుతా ఉండాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం తప్పని సరిగా నిర్వహించాలన్నారు. ఇళ్ల మధ్యలో కానీ, ఇతర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా సంబంధిత స్థల యజమానులతో మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె సంజయ్‌రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

విఎంసిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నగర కమిషనర్ ధ్యానచంద్ర కేక్ కట్ చేసి, ఆయాశాఖల అధికారులు, ఉద్యోగులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ కె సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ పి సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ నూతన విజన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సామ్‌సంగ్ పవరింగ్ ఇన్నోవేషన్ ఫర్ ఇండియా అనే ఒక నూతన వ్యూహాత్మక దార్శనికతను ఆవిష్కరించిందని సంస్థ సిఈవో జె.బి.పార్క్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. భారతదేశంలో తన 30 ఏళ్ల కార్యకలాపాలను సామ్‌సంగ్ గుర్తుచేసుకుంటోందిఅన్నారు.. డిజిటల్ పరివర్తన, మేక్ ఇన్ ఇండియా తయారీ ఆశయాలు, ఆవిష్కరణ-ఆధారిత ఆర్థిక వృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వామిగా తన నిబద్ధతను ఈ కొత్త దక్పథం బలోపేతం చేస్తుందని అన్నారు .1995లో భారతదేశంలోకి ప్రవేశించి నప్పటి నుండి, గృహ వినోదాన్ని పునర్నిర్వచించే టెలివిజన్‌లను ప్రవేశపెట్టడం నుండి నోయిడాలో ప్రపంచంలోనే అతి పెద్ద మొబైల్ తయారీ సౌకర్యాలలో ఒకదాన్ని స్థాపించడం మొదలుకొని ఇప్పుడు తన ప్రపంచ పర్యావరణ వ్యవస్థకు శక్తిని చేసేలా భారతదేశంలో నిర్మించిన ఆవిష్కరణలను నడిపించడం వరకు సామ్‌సంగ్ విస్తరించింది అని తెలిపారు. రూ. 1.11 లక్షల కోట్ల ఆదాయంతో, సామ్‌సంగ్ నిజమైన ఎండ్-టు-ఎండ్ ఏఐ పర్యావరణ వ్యవస్థను కలిగి ఉన్న ఏకైక బ్రాండ్ అని తెలిపారు. ఇది స్మార్ట్‌థింగ్స్ ద్వారా గెలాక్సీ ఏఐ, బెస్పోక్ ఏఐ, విజన్ ఏఐలను ఒకచోట చేర్చుతుందన్నారు.

తిరుమలగిరి హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలను లెక్కించారు. మూడు నెలల 18 రోజుల తర్వాత లెక్కించగా రూ.26,93,530, శివాలయం హుండీ ద్వారా రూ.29,843, అన్నదానం హుండీ ద్వారా 1,18110 రూపాయలు ఆదాయం చేకూరిందని ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి మరియు ధర్మకర్తల మండల చైర్మన్ కే రవీంద్ర భరద్వాజ్ తెలిపారు.

గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా సోమవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అప్పారావు పాల్గొన్నారు.

చందర్లపాడు: స్థానిక ఎస్సీకేయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రియదర్శిని అధ్యక్షతన ఎగ్జిబిషన్ నిర్వహించారు.

జగ్గయ్యపేట: చిల్లకల్లు వెంకటరమణ స్కూల్లో గణిత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ధరణికోట వెంకటరమణ, ప్రిన్సిపల్ కొత్త లక్ష్మీ పాల్గొన్నారు. విజ్ఞాన్ హైస్కూల్లో విద్యార్థులు తయారు చేసిన 150 గణిత నమూనాలను స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి పరిశీలించారు. అనంతరం బహుమతులు అందజేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత నమూనాలను విద్యార్థినులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని హేమామాధవి, గణిత ఉపాధ్యాయులు రేవతి, రూబీన్ లక్ష్మి, రాజి, ఎం హనుమంతరావు, బి కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

జి.కొండూరు: వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కరెస్పాండెంట్ ఎం.ఈశ్వరరావు, పాల్గొన్నారు.

తిరువూరు: తిరువూరు నాగార్జున పాఠశాలలో ప్రిన్సిపల్ కె.నరసింహారావు రామానుజన్ జీవిత విశేషాల విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వి.నాగేశ్వరరావు చైర్మన్ డి.హనుమంతరావు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: అనిగండ్లపాడులోని శ్రీ చైతన్య హైస్కూల్లో స్కూల్ డైరెక్టర్స్ నగేష్, నరేష్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో మ్యాథ్స్ ఎక్స్పో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ చైతన్య, హరిణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి ఎన్ఆర్ఐ పాఠశాల ప్రిన్సిపల్ నాగరత్న పాల్గొన్నారు.

జి.కొండూరులో...

చందర్లపాడులో...

బిసిలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : జాతీయ బిసి సంక్షేమ సంఘం విజయవాడ నగర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బాడిశ రూపేష్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో నగర బిసి నేతల సమావేశం జరిగింది. ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చిన విధంగా 34 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని, అవకాశం ఉంటే 42 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలసి విజ్ఞప్తి చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం నేతలు ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ యలగాల నూకానమ్మ యాదవ్‌ను కోరారు. ఈ సందర్భంగా నూకానమ్మ మాట్లడుతూ గత ప్రభుత్వం బిసిలను మోసం చేసి 34 శాతం ఉన్న రిజర్వేషన్లు కుదించి 24 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లడం వలన 16,800 మంది బిసిలు స్థానిక ప్రజా ప్రతినిధులు కాలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు కన్నీశెట్టి లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్, జిల్లా కార్యదర్శి దుర్గారావు, రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పట్నాల హరిబాబు, కార్యదర్శి మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు అడ్డురి రాము, యూత్ విభాగం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గోద్రెజ్ నూతన ఉత్పత్తులు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గోద్రెజ్ ఆగ్రోవెట్ అనుబంధ సంస్థ అయిన క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ ఉత్పత్తులు విస్తరించనున్నట్లు సంస్థ సిఈవో ఆనంద్ రామ స్వామి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. , గోద్రెజ్ జెర్సీబ్రాండ్ పేరుతో ఉత్పత్తులను విక్రయిస్తోన్న సంస్థ , తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం (జిఓటి)తో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు . కంపెనీ 40 ఎకరాలలో అత్యాధునిక పాల ప్రాసెసింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి 150 కోట్ల రూపాయలను పెట్టుబడి పెట్టనుంది. అని తెలిపారు .ఈ కొత్త పెట్టుబడితో, రాష్ట్రంలో గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ యొక్క మొత్తం పెట్టుబడి ప్రణాళికలు ఇప్పుడు దాని వివిధ వ్యాపారాలలో 10 వేల కోట్ల రూపాయలకు పైగా ఉన్నాయి. అని తెలిపారు. రానున్న కాలంలో మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.

ఎంపిని కలిసిన ఎఎంసి చైర్మన్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల సీతమ్మ, వైస్ ప్రెసిడెంట్ అడుసుమిల్లి ప్రభాకర్ తో పాటు మిగిలిన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో ఎంపీ కేశినేని శివనాథ్ ను సోమవారం ఆయన కార్యాలయంలో కలిశారు. తమకి అవకాశం కల్పించినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏ.ఎమ్.సి చైర్మన్ మల్లెల సీతమ్మ, కొండయ్య దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-తిరువూరు: అనారోగ్యంతో మృతిచెందిన తన స్నేహితుడి కుటుంబానికి సహచరులు ఆర్థిక సహాయం చేసి తమ స్నేహాన్ని చాటుకున్నారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన షేక్ అబిద్ అలీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయాన్ని తెలుసుకున్న ఆయనతో పాటు చదువుకున్న స్నేహితులు స్పందించారు. మైలవరంలో నివసిస్తున్న ఆయన కుటుంబ సభ్యులకు ఆదివారం రాత్రి తొలి విడతగా రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు బ్యాచ్ ప్రతినిధులు ఎం.రాం ప్రదీప్, ఎం.చక్రధర్, కె.వాసు, ఎం.జానకి రామయ్య, ఆర్.అంజిరెడ్డి, కె.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి : సౌమ్య

ప్రజాశక్తి-నందిగామ: రైతుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం అందుబాటులో ఉండాలని నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. సోమవారం నందిగామ మార్కెట్ యార్డ్ చైర్మన్ పిట్టల శ్రీ దేవి, ఎఎంసి వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాల, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అనుసంధానంగా నేషనల్ హైవేపై నందిగామ మార్కెట్ యార్డు ఉండటం రైతులకు ఎంతో సౌకర్యంగా ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పాలకవర్గ సభ్యులు ఎప్పటికప్పుడు రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో నకిలీ సిగరెట్ల దందా!



ప్రజాశక్తి-నందిగామ: అధికారులు గాఢనిద్రతో జిల్లాలో నకిలీ సిగరెట్ల దందా జోరుగా సాగుతోంది. నందిగామ, జగ్గయ్యపేట కేంద్రంగా అక్రమ పద్ధతుల్లో సిగరెట్ల విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు వివిధ పద్ధతుల్లో విదేశీ సిగరెట్లతో పాటు ఇతర రాష్ట్రాల్లో తయారయ్యే నకిలీ సిగరెట్లను నందిగామకు తీసుకువస్తున్నారు. నందిగామ వాసవీ మార్కెట్ కేంద్రంగా గంజాయి, సిగరెట్లు అమ్ముతున్నట్లు సమాచారం. ట్రాన్స్‌పోర్టులలో భారీగా నకిలీ, విదేశీ సిగరెట్లు నందిగామ, జగ్గయ్యపేటకు చేరుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలు, నేపాల్ వంటి దేశాల నుంచి నకిలీ సిగరెట్లను తీసుకొచ్చి ఇక్కడ దుకాణాలకు అక్రమార్కులు విక్రయిస్తున్నారని పలువురు చెబుతున్నారు. నకిలీ సిగరెట్లు తాగిన యువకులు మత్తులో జోగుతూ సామాన్య ప్రజలపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. నందిగామ రైతుపేటలో కాకతీయ రెస్టారెంట్ వద్ద రాత్రి సమయాల్లో కొంతమంది యువకులు మత్తులో జోగుతూ సిగరెట్లు తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. సాధారణ కంపెనీల సిగరెట్లతో కలిపి నకిలీవి విక్రయిస్తుండటంతో చిరు వ్యాపారులకు సైతం తెలియకుండా ఇవి వినియోగదారులకు చేరిపోతున్నాయి. ఏడాది క్రితం నందిగామలో ఒక గోడౌన్లో ఉంచిన నకిలీ సిగరెట్లను గుర్తించారు. పాత బస్టాండ్, రైతు పేట, మెయిన్ బజార్లలో కూడా నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం. నకిలీ సిగరెట్ల విక్రయాలు చేసే వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. కొంతమంది ఎన్నిసార్లు దొరికినా తిరిగి ఇదే వ్యాపారం చేస్తున్నారని, కొంతమంది అధికారుల కన్నుసన్నల్లోనే ఈ అక్రమ దందాలు గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి నకిలీ సిగరెట్ దందాను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

గురుమూర్తికి అభినందనలు తెలుపుతున్న బోడేప్రసాద్

గురుమూర్తికి అభినందనలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడుగా నియమితుడైన రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తికి తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం గురు మూర్తిన ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కె.శ్రీను. గోవాడ శివ, చాట్ల రమేశ్, సందీప్, నాగభా స్కర్, శివశంకర్ తదితరులు గురుమూర్తిని కలసి అభినందనలు తెలిపారు.**ప్రజాశక్తి-కంకిపాడు** : కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా వీరంకి వెంకట గురుమూర్తికి అవకాశం కల్పించడమే టిడిపి బీసీలకు సముచితస్థానం కల్పించిందనడానికి నిదర్శనమనిఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా కృష్ణాజిల్లా మచిలీపట్నం పార్లమెంటు అధ్యక్షునిగా ఎన్నికైన వీరంకి వెంకట గురుమూర్తినీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ప్రేరేపి ఈశ్వర్, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, తాడిగడప మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు, మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పెడన మున్సిపల్ కార్మికులు గోడపత్రికను ఆవిష్కరించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ కష్ణా జిల్లా అధ్యక్షులు బూర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం పేరు మార్పుపై నిరసనలు

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : ఉపాధి హామీ చట్టం పేరు మార్పుపట్ల మచిలీపట్నంలోని చమనగిరిపేట గాంధీ బొమ్మ శివాలయం దగ్గర సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు సీనియర్ నాయకులు మాట్లాడుతూ సామాన్యుల నడ్డి విరిచి కార్పొరేట్లకు దోచి పెట్టేలా, పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూలమైన చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందని దుయ్యబట్టారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెడుతూ వాటిపై తగినంత చర్చ జరపకుండానే ఆమోదింప చేసుకోవడం తగదని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చీకటి రాజేష్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ నాయకులు టీ చంద్ర పాల్, ఎస్ భుజంగరావు, పామర్తి నాగయ్య, మచిలీపట్నం సిపిఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, నగర కన్వీనర్ చిరువోలు జయరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చి, గాంధీ పేరుతో ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అలాగే కొనసాగించాలని కోరుతూ మొవ్వ మండలం కాజ గ్రామంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొడాలి కరుణాకర్ రావు, ఉపాధి కార్మికులు కొడాలి రజాకరావు, రాయవరపు మునిమ్మ, పాప, కొక్కిలిగడ్డ ప్రభాకర్, రాయవరపు ఆశీర్వాదం పాల్గొన్నారు.**ప్రజాశక్తి-బంటుమిల్లి** : ఉపాధి హామీ చట్టం పేరు మార్పుకు నిరసనగా సిపిఎం నాయకులు ఎంపీడీవోకి వినతిపత్రం అందించారు. సిపిఎం మండల కార్యదర్శి మాజీటి శివ శ్రీనివాసరావు, లంకదాసుల అజయ్ గోష్, గౌరిశెట్టి నాగేశ్వరావు, నాగిశెట్టి కష్ణమూర్తి, పొదల వెంకన్న, వంగల రాజు, గౌరి శెట్టి పాండురంగారావు పాల్గొన్నారు

బందరులో...

బంటుమిల్లిలో..

మొవ్వలో...

గోపుకు అభినందనలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణజిల్లా టిడిపి ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన గోపు సత్యనారా యణను మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ గోపు సత్యనారా యణ పార్టీకి విధేయుడుగా ఉంటూ పార్టీ అప్ప చెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ క్రమశిక్షణ గల వ్యక్తిగా పార్టీ అధిష్టానం గుర్తించిందని కొనియాడారు. సర్పంచ్ గా, మార్కెట్ యార్డ్ చైర్మన్ గా సేవలందించారని, జిల్లా రైతు సంఘ అధ్యక్షుడిగా రైతు సమస్యల పరిష్కారానికి కషి చేశారని అన్నారు. మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు,పోతేపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ బండి శివ, టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కాటం మధుసూదన రావు,వేముల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లిలోని సెయింట్ జాన్స్ స్కూల్లో రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్కూల్ ప్రిన్సిపాల్ ఝాన్సీ, కరెస్పాండెంట్ సాబు జాన్ పాల్గొని మాట్లాడుతూ భారత దేశానికి చెందిన శ్రీనివాస రామానుజన్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించి బహు మతులు అందించారు. గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే కొమ్మారెడ్డి స్కూల్లో గణిత దినోత్సవం, 'సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన 500 పైగా మ్యాథ్స్ మోడల్స్ నుండి 50 మోడల్స్ ను బెస్ట్ మోడల్స్ గా ఎంపిక చేసి బహుమతులు ప్రధానం చేశారు. మ్యాథ్స్ క్విజ్ పోటీలు, టాలెంట్ టెస్టులు, టేబుల్స్ పోటీలలో గెలుపొందిన 221 మంది విద్యార్థులకు కూడా బహుమతులు అందించారు. సెమీక్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన డ్యాన్స్, క్రిస్మస్ గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, కరెస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ, కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య , డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ కొమ్మారెడ్డి హరణి ,విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ 138వ జయంతిని అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జాతీయ గణిత దినోత్సవంగా దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గణితంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దొరబాబు, అభివద్ధి కమిటీ తరపున మతి శ్రీనివాసరావు, గుడిసె వ విష్ణు ప్రసాద్ బహుమతులు అందించారు. **ప్రజాశక్తి-పామర్రు** : పామర్రుకు చెందిన ఎన్టీఆర్-ఘంటసాల కళా పీఠం ఆధ్వర్యంలో మండల పరిధి పసుమర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం గణితంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో10 తరగతికి చెందిన జి. కల్పన,9వ తరగతి చెందిన మేఘన,యు.హాసిని7తరగతికి చెందిన సిహెచ్ దేవి ప్రసన్న,6 తరగతి చెందిన సంతోష్ లు ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు కళా పీఠం అధ్యక్షుడు మురళీకష్ణ ప్రతిభ సర్టిఫికెట్లు ఇచ్చి సత్కరించారు. హెచ్ఎం.హనుమ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఘంటసాల** : ఘంటసాల మండలంలోని కొడాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామానుజన్ జయంతిని నిర్వహించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు పోతన లక్ష్మీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు గుమ్మడి వెంకట్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు గణితంపై క్విజ్, వక్తత్వ మరియు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు గుమ్మడి వెంకట్ స్పాన్సర్ చేసిన రూ. 21,000 విలువైన బహుమతులతో పాటు, మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : రామానుజన్ జయంతిని పురస్కరించుకుని చల్లపల్లిలోని విజయా అకాడమీలో కొత్తగా ఏర్పాటు చేసిన మ్యాథ్స్ ల్యాబ్‌ను కృష్ణాజిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ వివిపిఎస్. ఆంజనేయులు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకబుష్ణ, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా విద్యార్థులకు గణితం పట్ల అవగాహన కార్యక్రమాలు జరిపామని తాడింకి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలమంచిలి నాగ శివప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రులో...

బంటుమిల్లి మండలంలోని కొమ్మారెడ్డి స్కూల్, సెయింట్ జాన్స్ పాఠశాలలో...

'మస్తాబు' గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : 'మస్తాబు' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్య సమాజాన్ని స్థాపించాలని జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అమలుపరుస్తున్న "మస్తాబు " కార్యక్రమానికి సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ, రూపొందించిన ప్రచార చిత్రాలను కలెక్టర్ సోమవారం పిజిఆర్ఎస్ హాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ 'ముస్తాబు' కార్యక్రమం ఆరోగ్యం, ఆహ్లాదం, క్రమశిక్షణ, అలవర్చుకోవడానికి దోహదం చేస్తుందని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటుగా చేసుకోవడానికి రూపొందించిన కార్యక్రమాన్ని అన్ని విద్యాసంస్థల్లో సమగ్రంగా నిర్వహించాల్సిందిగా కోరారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారి యం. ఫణి ధూర్జటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్,, డిఆర్ఓ చంద్రశేఖర్ రావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి,మెప్మా పిడి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



బీమా సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : పులిగడ్డ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్స్‌కు సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఈవో బి. అనిత గ్రామ పంచాయతీ తరపున వారికి రూ 10 లక్షల రూపాయల బజాజ్ జనరల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించారు. పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఈవో అనిత, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు ల చేతుల మీదుగా ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు వారికి అందించారు.

బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి కృషి : రాంప్రసాద్

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : రాష్ట్రంలో బ్రాహ్మణుల ఆర్థికాభివద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కలపటపు బుచ్చి రాంప్రసాద్ తెలిపారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణి కుమార్ నివాసంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కషిని వివరించారు. ఆదరణ పథకం కింద బ్రాహ్మణులు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపిచంద్, బ్రాహ్మణ సంఘాల ప్రతినిథులు డా. బి ధన్వంతరీ ఆచార్య, సింగరాజు గోవర్ధన్, రామకృష్ణ పాల్గొన్నారు.

సబ్ పోస్టాఫీస్ కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : పెడన పట్టణంలోని బ్రహ్మపురం ప్రాంతంలో ఉన్న సబ్ పోస్ట్ ఆఫీస్‌ను కొనసాగిం చాలని పట్టణ సిఐటియు కార్యదర్శి గౌర్రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం మచిలీ పట్నం హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్టల్ ఉన్నతాధికారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలంకారీ కార్మికులకు, చేనేత వత్తి కార్మికులకు అందుబాటులో చిన్న చిన్న పొదుపు మొత్తాన్ని దాచుకోవడానికి ఈ సబ్‌పోస్టాఫీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు.

వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నిమ్రాలో ఫౌండర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: నిమ్రా విద్యాసంస్థలలో ఫౌండర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిమ్రా విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినైన నారాయణ మూర్తి పాల్గొని మాట్లాడుతూ విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ విజారత్ రసూల్ ఖాన్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 22 న ఫౌండర్స్ డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో చదువు మరియు ఆటలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ గులాం గౌస్, ప్రిన్సిపల్ డాక్టర్ అక్బర్ ఖాన్, డాక్టర్ అబ్దుల్ బాజీ, డాక్టర్ అసదుల్లా ఖాన్, షరీఫ్ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అభివృద్ధికి ఆ కళాశాల పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షులు రవీంద్రవర్మ పిలుపునిచ్చారు. పీఎస్ సీఎంఆర్ గ్రాండ్ రీయూనియన్ 2025 హైదరాబాద్ చాప్టర్' పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్‌సుధీర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, కళాశాల ఉపాధ్యక్షులు పొట్టి సురేంద్రకుమార్, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, కమిటీ సభ్యులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అమరావతి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచిన కరాటే విజేతలకు తక్షశిల స్కూల్ ప్రాంగణంలో సోమవారం బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలిండియా బుడో షోటో కరాటే అసోసియేషన్ సౌత్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో విజయం సాధించిన తక్షశిల స్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా తక్షశిల స్కూల్ ప్రిన్సిపాల్ నమన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని పేర్కొంటూ విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మన్నె భాస్కరరావు, కంభంపాటి పుల్లారావు పాల్గొన్నారు.

న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షునిగా రామకృష్ణ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: విజయవాడ శిశువిద్యామందిర్‌లో జరిగిన న్యాయవాది పరిషత్ సమావేశంలో కృష్ణా జిల్లా విభాగ నూజివీడు 15వ అదనపు జిల్లా కోర్టు పరిధి న్యాయవాది పరిషత్ కార్యవర్గం నియామకం జరిగింది. అధ్యక్షుడుగా రెడ్డిగూడెం మండలం బూరుగగూడెం గ్రామానికి న్యాయవాది రామినేని రామకృష్ణను నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రామకృష్ణ కు శుభాకాంక్షలు తెలిపారు.

అమరావతిలో స్పోర్ట్స్ యూనివర్శిటీ : ఎంపి

జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: అమరావతిలో స్పోర్ట్స్ యూనివర్శిటీ రానుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో యోనెక్స్- సన్ రైజ్ 78వ జాతీయ అంతర్ రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 22 నుంచి 28 వరకు జరిగే పోటీలను ఎంపీ కేశినేని శివనాథ్ , ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేష్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, శాఫ్ చైర్మన్ అనిమిని రవినాయుడు, స్టార్ షట్లర్ పివి సింధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించేందుకు కృషి జరుగుతుందన్నారు. నేషనల్ గేమ్స్ కూడా శాప్ ఆధ్వర్యంలో రాష్ట్రానికి రావాలని ఆకాంక్షించారు. నగరానికి 78వ జాతీయ అంతర్ రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ -2025 పోటీలు తీసుకువచ్చేందుకు కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘానికి, సెక్రటరీ డాక్టర్ పి.అంకమ్మచౌదరికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో అమరావతిలో నిర్మించనున్న స్పోర్ట్స్ యూనివర్శిటీ లో క్రీడాకారులతో పాటు క్రీడలకు సంబంధించిన అనుబంధ విభాగాల సిబ్బంది కోసం శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. దేశానికి స్పోర్ట్స్ కోచ్ లను తయారు చేసే రాష్ట్రంగా ఏపీ తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ ఎమ్‌డి ఎస్.భరణి, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎమ్.ద్వారకానాథ్, సెక్రటరీ డాక్టర్ పి. అంకమ్మచౌదరి, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, శాప్ డైరెక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపి శివనాథ్

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కమిషనర్

అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ: అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు మూడు సర్కిల్స్ పరిధిలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం సోమవారం జరిగింది. నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి, వారి వారి సమస్యలపై అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతున్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వినతులను పరిష్కరించాలని కోరారు. అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో పలు చోట్ల కేబుల్ వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా తయారయ్యాయని, వాాహనదారులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా కేబుల్ యజమానులతో సరి చేయించాలని కోరారు. పట్టణ ప్రణాళిక విభాగంనకు సంబంధించి 11 అర్జీలు, ఇంజనీరింగ్ ఐదు, రెవెన్యూ నాలుగు, ఎస్టేట్ విభాగంనకు సంబంధించి నాలుగు, ఉద్యానవన విభాగంనకు సంబంధించి రెండు అర్జీలను అధికారులు స్వీకరించారు.

27న లైమ్‌లైట్ అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఈ నెల 27న లైమ్‌లైట్ అవార్డ్స్ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. సంస్థ వార్సికోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన మహిళలు, పురుషలను సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని మంగోల్లు గ్రామంలో సోమవారం గ్రామ రైతు సేవా కేంద్రంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మన్నె నారాయణ, మన్నె నారాయణరావు, మన్నె నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రాజగోపాల్ అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీలలో జగ్గయ్యపేట మండలంలోని ఉపాధ్యాయినిలు త్రోబాల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం మైలవరం పట్టణంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలలో మరింత ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే రాజగోపాల్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ ఘంటా వెంకటేశ్వరరావు, రెడ్డి, వై.మణిరత్నం పాల్గొన్నారు.

ఫ్లవర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: స్థానిక ఈనాడు గ్రౌండ్స్‌లో ఆంధ్రప్రదేశ్ ఫ్లవర్ షోను సోమవారం స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రసిద్ధిగాంచిన మొక్కల పెంపకం దార్ల నర్సరీల నుంచి అతి అరుదైన మొక్కలు ప్రదర్శనకు, విక్రయానికి ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ గరిమెళ్ళ జానకి రామయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌ను వినియోగించుకోవాలని కోరారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల్లో కాలుష్యంపై ఆరోగ్యం భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి కారణం ఇటువంటి పచ్చదనాన్ని పెంపొందించే మొక్కల పెంపకం పై అవగాహన కల్పించడం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు చెన్నుపాటి గాంధీ, స్థానిక కార్పొరేటర్ కాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు అభినందనలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కొండపల్లి పురపాలక చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబును మునిసిపాలిటీ కార్యాలయంలో మైలవరం నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ గణపతి, పజ్జూరు శ్రీనివాసరావు, బడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మున్సిపల్ బడ్జెట్ రూ.7.84 కోట్లు

ప్రజాశక్తి-నందిగామ: 2026-27 సంవత్సరానికి నందిగామ మున్సిపాలిటీ బడ్జెట్‌ను రూ.7.84 కోట్లుగా అధికారులు చూపించారు. నందిగామ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం సోమవారం బాబు జగ్జీవన్ రామ్ హాల్లో మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి అధ్యక్షతన జరిగింది. రూ.7.03 కోట్లు ప్రారంభ నిల్వగా ముగింపు నిల్వగా రూ. 5.42 కోట్లుగా అధికారులు చూపించారు. పలు పద్దుల ద్వారా సాదారణ, మూలధన ఆదాయం రూ. 38 కోట్లు, ఖర్చులు రూ. 39.61 కోట్లు అంచనా వేసి రూ. 5.42 కోట్ల నిల్వ తో ముగింపు అంచనా బడ్జెట్ నందు చూపించారు. అంచనా బడ్జెట్ నందు 2025-26 కు ఆస్తి పన్ను బకాయిలు ప్రభుత్వ భవనాలు కలుపుకుని రూ. 53 లక్షలు, 2026-27కు డిమాండ్ రూ. 7.3 కోట్లు కలిపి బడ్జెట్ రూ. 7.84 కోట్లు చూపుతూ సదరు మొత్తం లో రూ.5.72 కోట్లు వసూళ్ల అవుతుందని చూపించారు. మున్సిపాలిటీ కి వివిధ పన్ను ల ద్వారా రూ. 8.8 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. డ్రెయినేజీ, నీటి పన్ను ద్వారా రూ. 2.78 కోట్లు ఆదాయం వస్తుందని, భవనాలు, ఆక్రమణ, లేఅవుట్, బిల్డింగ్ ప్లాన్ ఫీజు, వగైరా ద్వారా కోటి 20 లక్షల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. నందిగామ మున్సిపాలిటీలో మంచి నీటి సమస్యలు పరిష్కారం చేయాలని, బడ్జెట్ లో తక్కువ నిధులు కేటాయించారని, వాటరు సప్లయి ట్యాంకులు కాంట్రాక్టు లకు బిల్లులు తక్షణమే చెల్లించాలని, కోర్టు రోడ్లు లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లకు మరమ్మత్తులు చేయాలని, డ్రెయినేజీ లు నిర్మించాలని పలు సమస్యలపై వైసీపీ కౌన్సిలర్‌లు అధికారులను ప్రశ్నించారు. మున్సిపాలిటీ కి శాశ్వత భవనం నిర్మించాలని కౌన్సిలర్ మారం అమరయ్య డిమాండ్ చేశారు. 50 లక్షలు భవనం నిర్మాణం కు వున్నాయని, అంచనాలు పెరగటం తో 2 కోట్లు అవసరమవుతుందని, ఎంపి, ఎమ్మెల్యే నిధులు కేటాయించడానికి ముందుకు వస్తే మున్సిపాలిటీకి శాశ్వత భవనం కట్టవచ్చుని కమిషనర్ లోవరాజు తెలిపారు. మున్సిపల్ ఎఇ ఫణి శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రసాద్, కౌన్సిలర్ లు సత్యవతి, గద్దె ఝాన్సీ, ఖాలీక్, ఒర్సు దివ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.